**రక్తచరిత్రకు 75 ఏళ్లు**



రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలిచిన పోరాటాల పురిటి గడ్డ వీర బైరాన్పల్లి. మాతృభూమి విముక్తి కోసం పోరాడి ఎందరో యోధులు నేల కొరిగిన నెత్తుటి చరిత్రకు 75 ఏండ్లు పూర్త వుతున్న సందర్భంగా కథనం. 8లో



**ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం**

ఆర్టీసీ బస్సులో ఓ మహిళకు సుఖ ప్రసవం జరిగిన సంఘటన జహీరాబాద్‌లో చోటు చేసుకుంది. డ్రైవర్, మిర్జాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. 8లో



**మొక్కలతోనే మనుగడ**

కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రీకారం చుట్టారు. వృక్ష సంపదను పెంచి పర్యావరణాన్ని కాపాడుదామని పిలుపునిచ్చారు. 9లో

## న్యూస్‌రీల్

### లోక్ అదాలత్‌లో రాజీ చేయండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

**మెదక్:** సెప్టెంబర్‌లో మెదక్ కోర్టులో జరగబోయే లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులను రాజీ చేయాలని లోక్ అదాలత్ గౌరవ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులో పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని జిల్లా కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహిస్తామని, ఇందులో ఎక్కువ కేసులను రాజీ చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కుటుంబ తగదాలు, రోడ్డు ప్రమాదాలు, భార్యాభర్తల కేసులు, భూ తగదాలు, చెక్ బౌన్స్ తదితర కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని, సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ జితేందర్, జడ్జి రీటాలాల్ చంద్, పోలీస్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

### వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

**కొల్చారం(నర్సాపూర్):** త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కిష్టాపూర్, నాయిని జలాల్ పూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ఇటీవల మరణించిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్న నమ్మకాన్ని ప్రజలు పూర్తిగా విశ్వసిస్తున్నారన్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, స్టేట్ ఓబీసీ సెల్ రాష్ట్ర నాయకుడు మురళీధర్, మైనార్టీ సెల్ కార్యదర్శి హకీం, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రియాజ్ అలీ, మండల వైస్ ప్రెసిడెంట్ గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అక్రమ్ తదితరులు ఉన్నారు.

### వీక్లీ పరేడ్‌తో ఫిజికల్ ఫిట్నెస్

అదనపు ఎస్.పి అడ్మిన్ మహేందర్



వీక్లీ పరేడ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

**మెదక్ మున్సిపాలిటీ:** వీక్లీ పరేడ్‌తో ఫిజికల్ ఫిట్నెస్ లభిస్తుందని అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మెదక్‌లోని జిల్లా నూతన పోలీసు కార్యాలయ ప్రాంగణంలో సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, వర్టికల్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐలు అచ్యుతరావు, నాగేశ్వర్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆయిల్ ఫామ్ సాగు లాభదాయకం

జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సయ్య



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సయ్య

**తూప్రాన్:** ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుండ్రెడ్డిపల్లి రైతువేదికలో ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూప్రాన్ మండలానికి 500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. లివింగ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేయడానికి, పంట బై బ్యాక్‌కు ఒప్పందం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, రాజేశ్వరశర్మ, రాజిరెడ్డి, కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### 29న చలో మైదాన్

**మెదక్ కలెక్టరేట్:** భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చాంద్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 29న చలో మైదాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు శనివారం తెలిపారు. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో చలో మైదాన్ క్రీడా అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. యువజన, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, వ్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

# హరిత తెలంగాణే లక్ష్యం

- జిల్లా వ్యాప్తంగా నాటిన మొక్కలు
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- మొక్కల సంరక్షణ బాధ్యత చేపట్టాలని వినతి



రామాయంపేటలో మొక్క నాటుతున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**రామాయంపేట(మెదక్):** భవిష్యత్ తరాలకు హరిత తెలంగాణ అందించే విధంగా సీఎం కృషి చేస్తున్నారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం రామాయంపేటలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రామాయంపేటకు రెవెన్యూ డివిజన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయడం సంతోషకరమన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుతో నిరుపేద విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో 1.40 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యం మేరకు రహదారుల పక్కన, చెరువు కట్టలపై మొక్కలు నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**అటవీ విస్తీర్ణం పెరిగింది**

**మనోహరాబాద్(తూప్రాన్):** సీఎం కేసీఆర్ హరిత తెలంగాణ లక్ష్యంగా కృషి చేయడంతో అటవీ విస్తీర్ణం 7.7 శాతం పెరిగిందని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత, ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రభుత్వ ఆదేశం మేరకు స్వాతంత్ర్య వజ్రోత్సవాలను పురస్కరించుకొని కోటి మొక్కలనాటే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కూచారంలో సర్పంచ్ జక్కిడి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గడా ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పురం మహేష్, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, పీఆర్ఏఈ మధు, ఏపీఓ ఆదినారాయణ, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింలుగౌడ్, రమేష్‌గౌడ్, దాసరి నరేష్, మోంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు,



కూచారంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత

**మొక్కలను సంరక్షించాలి**

**కొల్చారం(నర్సాపూర్):** హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాల్సి బాధ్యత అందరిదని అదనపు కలెక్టర్ రమేష్, డీఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని వరిగుంతం ఉన్నత పాఠశాల ఆవరణలో కోటి మొక్కల వృక్షార్చన కార్యక్రమానికి హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గతేడాది హరితహారంలో మొక్కలు నాటడం ద్వారా అవార్డుతో పాటు గ్రామ అభివృద్ధికి రూ.2 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సంతోష్ కుమార్ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గణేష్ రెడ్డి, ఎంపీఓ కృష్ణవేణి,ఏపీఓ మహిపాల్ రెడ్డి, హెచ్ఎం రామేశ్వర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**హరితహారంతో ప్రకృతి సంపద వృద్ధి**

**తూప్రాన్:** దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా హరితహారం కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోందని మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల సందర్భంగా ఒక్కరోజు కోటి మొక్కల కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో గడా ప్రత్యేకాధికారి ముత్యం రెడ్డి, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, కమిషనర్ మోహన్, కౌన్సిలర్లు మామిడి వెంకటేష్, శ్రీశైలం గౌడ్, నారాయణగుప్త, సత్య లింగం, వెంకట్ గౌడ్, తలారి మల్లేష్, రాజు, రఘు పతి, రవీందర్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ రఘువరన్ పాల్గొన్నారు.

**మొక్కలు నాటిన జెడ్పీ సీఈఓ**

**చిన్నశంకరంపేట(మెదక్):** చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ శైలేష్‌కుమార్ శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిధర్‌రెడ్డి, ఏపీఓ వెంకటసాయి, ఈజీఎస్ టీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

**అర్బన్ పార్కులో..**

**నర్సాపూర్:** నర్సాపూర్‌లోని అర్బన్‌పార్కులో శనివారం స్వాతంత్ర్య వజ్రోత్సవాలను పురస్కరించుకుని వృక్షార్చన కార్యక్రమం నిర్వహించారు. డీఎఫ్ఓ రవిప్రసాద్, ఎఫ్ఆర్ఓ అంబర్‌సింగ్, సిబ్బంది మొక్కలు నాటారు. ఈసందర్భంగా డీఎఫ్ఓ రవి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.



వరిగుంతం ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న అధికారులు



తూప్రాన్‌లో మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి



చిన్నశంకరంపేటలో మొక్క నాటుతున్న జెడ్పీ సీఈఓ శైలేష్‌కుమార్

# ప్రజల ఆత్మబంధువు కేసీఆర్

- అన్ని రంగాల్లో రాష్ట్రం నంబర్‌వన్
- రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శం
- మంత్రి హరీశ్‌రావు
- ఎస్సీ, బీసీలకు చెక్కుల పంపిణీ

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ నిత్యం శ్రమిస్తూ.. ప్రజల ఆత్మబంధువుగా నిలుస్తున్నారని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం దళిత బంధు ద్వారా 80 మంది లబ్ధిదారులకు, 276 మంది బీసీలకు చెక్కులను, ప్రొసిడింగ్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిద్దిపేట ప్రజలు అనేక సంవత్సరాలుగా మూడు విషయాలపై కలలు కన్నారని, నేడు అవి సఫలం అయ్యాయన్నారు. గోదావరి జలాలు, సిద్దిపేట జిల్లా కేంద్రం, రైలు సౌకర్యం కోసం ప్రజలు వేచి చూశారని, స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని సాధించుకున్నామన్నారు. నేడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు సమకుర్చుకున్నామన్నారు. దళితబంధు, బీసీ, మైనారిటీలకు ఆర్థిక సాయం ఎలాంటి షరతులు లేకుండా పూర్తి సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆత్మబంధువుగా నిలుస్తున్నారన్నారు. తెలంగాణలో అమలయ్యే ప్రతి సంక్షేమ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం కాపీ కొడుతుందన్నారు. కేంద్రంలో బీసీలకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సార్లు విన్నవించుకుందని, అయినప్పటికి బీసీ శాఖను కేటాయించలేదన్నారు. తెలంగాణ ప్రజలు స్ట్రాంగ్ లీడర్ కావాలో, రాంగ్ లీడర్ కావాలో తేల్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజాశర్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గూడ్స్ రైలు ఎదుట మంత్రి హరీశ్‌రావుతో సెల్ఫీ

# మహానగరాలకు త్వరలో రైలు సౌకర్యం

**ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట):** సిద్దిపేట రైల్వేస్టేషన్‌నుంచి రైలు సౌకర్యం ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని, ఇక్కడి నుంచే చెన్నై, బెంగళూరులాంటి మహానగరాలకు సైతం రైళ్లు వెళ్లేలా పరిశీలించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రైల్వేశాఖ అధికారులకు సూచించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ శివారులో నిర్మించిన నూతన రైల్వేస్టేషన్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. రైల్వే ట్రాక్‌ల మరమ్మతుల కోసం సామగ్రిని తీసుకువచ్చిన గూడ్స్ రైలుకు జెండా ఊపి ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. అనంతరం రైల్వేశాఖ అధికారులతో అక్కడే పలు అంశాలపై చర్చించారు. సిద్దిపేట ప్రజల ఎన్నో శతాబ్దాల కల రైలు సౌకర్యమని అన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న ప్రజలు హరీశ్‌రావుతో సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ పాలసాయిరాం, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, రైల్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.

### కనీస వేతనం ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

**శివ్వంపేట(నర్సాపూర్):** ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు తహసీల్దార్ కార్యలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు 18 ఏళ్లుగా పనిచేస్తున్నా వారు కనీస వేతనాలు పొందడంలేదన్నారు. ప్రభుత్వం స్పందించి కనీసవేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు వారికి పూర్తి మద్దతు ఇస్తామన్నారు. అనంతరం ఉపతహసీల్దార్ షఫీయొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.



ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

### ఆశా వర్కర్లతో వెట్టిచాకిరి తగదు

**మిరుదొడ్డి(దుబ్బాక):** కనీస వేతనాలను చెల్లించకుండా ఆశా వర్కర్లతో రాష్ట్ర ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కామునిగోపాల స్వామి మండిపడ్డారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట శనివారం ఆశ వర్కర్లతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఆయా తహసీల్దార్లకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో అనేక సంవత్సరాలుగా ఆరోగ్య కార్యకర్తలుగా పని చేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పని భారం తగ్గించి ఆశా వర్కర్లకు రూ.18 వేలు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్యం కోసం పాటు పడుతున్న ఆశా వర్కర్లకు ఎలాంటి ప్రమాద బీమా సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్లు లింగంపేట ఎల్లయ్య, మద్దెల అంజయ్య, ఆశ వర్కర్లు బాలమణి,లక్ష్మీ, సుజాత, మాలతి, రమణ, కవిత, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదులో అలక్ష్యం వద్దు

- ప్రచారం చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోమని హెచ్చరిక

**నర్సాపూర్ రూరల్:** ఓటరు నమోదు, తప్పుల సవరణకు ఏర్పాటుచేసిన కార్యక్రమంపై సరైన ప్రచారం చేయక పోవడంపై తహసీల్దార్ కమలాద్రి, బూతు లెవల్ అధికారి భూలక్ష్మిపై కలెక్టర్ రాజర్షి షా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని పెద్ద చింతకుంట ప్రాథమిక పాఠశాలలోఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంతమంది ఓటర్ నమోదు, తప్పుల సవరణకు వచ్చారని అక్కడ ఉన్న పోలింగ్ అధికారి భూలక్ష్మిని కలెక్టర్ ప్రశ్నించగా ఎవరూ రాలేదని సమాధానం ఇచ్చింది. ఎందుకు రాలేదు, విషయంపై చాటింపు వేశారా లేదా అని నిలదీయగా ప్రత్యేక ఓటర్ నమోదుపై ప్రచారం చేయలేదని బదులివ్వడంతో అక్కడే ఉన్న తహసీల్దార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈనెల 26, 27 తేదీలు, సెప్టెంబర్ 2, 3 తేదీలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో 18 ఏళ్ల నిండిన వారు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని, కార్డులో తప్పులుదొర్లినవారు సరి చేసుకోవాలని సూచించారు.

**హెచ్ఎం సెలవుపై ఆరా:**

పెద్దచింతకుంట పాఠశాల హెచ్ఎం బాలమణి సెలవుపై కలెక్టర్ ఆరా తీశారు. పాఠశాల మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.



పెద్ద చింతకుంట పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

## అధికారుల కృషితో జిల్లాకు మంచి పేరు

**నర్సాపూర్ రూరల్:** అధికారుల కృషితో జిల్లాకు మంచిపేరు వచ్చిందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట జలహనుమాన్ ఆలయం ఆవరణలో కోటి మొక్కల వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సీఎం కేసీఆర్ మెదక్ వచ్చిన సందర్భంగా నర్సాపూర్ నుంచి మెదక్ వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటినసందుకు అభినందించారన్నారు. ఇందుకు కృషిచేసిన ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, ఏపీఓలు, ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. మొక్కల పెంపకంతో రాష్ట్రంలో 7.7 శాతం అటవీ విస్తీర్ణం పెరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 4.40 లక్షల మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు.

**జలహనుమాన్ ఆలయంలో పూజలు**

పెద్దచింతకుంట జలహనుమాన్ ఆలయంలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ రమేష్, డీఆర్డీఓ శ్రీనివాస్, డీఎఫ్ఓ రవిప్రకాష్ పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీఓ మార్టిన్ లూథర్, ఎఫ్ఆర్ఓ అంబర్ సింగ్, ఉప సర్పంచ్ నాగరాజ్, ఏపీఓ అంజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు సుధాకర్ పాల్గొన్నారు.

### ఓటరుగా నమోదు చేసుకోవాలి

**కౌడిపల్లి(నర్సాపూర్):** 18 ఏళ్ల నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మండల కేంద్రమైన కౌడిపల్లిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. శని, ఆదివారం ఆయా గ్రామాలలోని ఎన్నికల బూత్‌లవద్ద బీఎల్ఓలు ప్రత్యేక ఓటరు నమోదు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీహరి, బీఎల్ఓలు ఫరీద, కమల, సుమిత్ర, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



కౌడిపల్లిలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

### తప్పులులేని జాబితా సిద్ధం చేయాలి



పాతూర్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

**హవేళీఘనపూర్:** తప్పులులేని తుది ఓటరు జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ రాజర్షిషా ఎన్నికల సిబ్బందిని శనివారం ఆదేశించారు. మెదక్ మండల పరిధిలోని పాతూర్ గ్రామంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ డే కేంద్రాన్ని సందర్శించారు. మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల కోసం తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. ఆయా మండలాల తహసీల్దార్‌లకు బీఎల్ఓల కిట్లను అందజేశారు.


### పోరాటం ఆపేది లేదు

**మెదక్ కలెక్టరేట్:** ప్రభుత్వం తమను క్రమబద్ధీకరించే వరకు పోరాటం ఆపేది లేదని సెకండ్ ఏఎన్ఎంలు తేల్చిచెప్పారు. 11 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు శనివారం నూతన కలెక్టరేట్ వద్ద సమ్మె కొనసాగించారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న సీఎం కేసీఆర్ తమ ఆవేదనను పట్టించుకోవడం లేదన్నారు. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో, కనీస వసతులు లేకున్నా ఎన్నో ఇబ్బందులు పడుతూ కాంట్రాక్టర్ పద్ధతిలో సేవలందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం శాంతియుతంగా కొనసాగిస్తామన్నారు.



కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత



ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ మున్సిపాలిటీ:** దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. శనివారం మెదక్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాశాఖ, సమగ్ర శిక్షణ, అలింకో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 182 మందికి రూ.12.90 లక్షలు విలువచేసే 256 పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ రూ.1,500 నుంచి రూ.4,016 పెంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, ఎంఈఓ నీలకంఠం, మెదక్ మునిసిపల్ చైర్మన్ చంద్రపాల్, సిడబ్ల్యూఎస్ఎన్ అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం


బస్సులో ప్రసవించిన మహిళ, బిడ్డతో నర్సు

జహీరాబాద్ టౌన్/న్యాల్‌కల్(జహీరాబాద్): ఆర్టీసీ బస్సులో ఓ మహిళ సుఖ ప్రసవం జరిగిన సంఘటన జహీరాబాద్‌లో చోటు చేసుకుంది. డిపో మేనేజర్ నారాయణ వివరాలు. పొట్‌పల్లి గ్రామానికి చెందిన హాజీ పాషా భార్య జరీనా బేగంకు పురిటి నొప్పులు వచ్చాయి. ప్రసవం కోసం బీదర్ ఆసుపత్రికి వెళ్లడానికి శుక్రవారం రాత్రి సహాయకులతో కలిసి జహీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు పట్టణం దాటగానే ఆమెకు నొప్పులు ఎక్కువయ్యాయి. బస్సు డ్రైవర్ ఆనందం, కండక్టర్ కరుణాకర్ మార్గమధ్యలో ఉన్న మిర్జాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి బస్సును తరలించారు. నర్స్ సుధారాణిని బస్సు వద్దకు తీసుకుని వచ్చేలోపు మహిళ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

### బియ్యం అక్రమ నిల్వలు పట్టివేత


బియ్యం అక్రమ నిల్వలను పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

గజ్వేల్: మండల పరిధి బయ్యారం చౌరస్తాలోని శారదా రైస్ ఇండస్ట్రీస్‌లో అక్రమంగా నిల్వ ఉన్న బియ్యాన్ని శుక్రవారం రాత్రి గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. రేషన్ బియ్యం తీసుకొచ్చి రీసైక్లింగ్ చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు అందింది. ఈ మేరకు దాడి చేసి 22 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. డీఎస్‌ఓ తనూజకు సమాచారమిచ్చి సంబంధిత అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: సాకి చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ అక్బర్‌ఖాన్ వివరాలు. పట్టణంలోని సాకి చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రక్తచరిత్రకు 75 ఏళ్లు..

- భైరాన్‌పల్లిలో జలియన్‌వాలాబాగ్‌ను మించిన నరమేధం
- రజాకార్ల దాడిలో 118 మంది గ్రామస్తుల బలి
- అమరుల కుటుంబాలకు దక్కని గుర్తింపు


అమరవీరుల స్థూపం

**రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలిచిన పోరాటాల పురిటి గడ్డ వీర భైరాన్‌పల్లి. అన్యాయాలపై గ్రామంలోని పిల్లల నుంచి పడచు యువతుల వరకు తిరుగుబాటు చేశారు. గడ్డి కోసిన చేతులు కొడవళ్లు పట్టాయి. అన్నం వండిన చేతులు బందూక్‌లు పట్టాయి. రజాకార్ల దుర్నీతికి వ్యతిరేకంగా పిడికిలెత్తాయి. మాతృ భూమి విముక్తి కోసం పోరాడి ఎందరో యోధులు నేలకొరిగిన నెత్తుటి చరిత్రకు నేటితో 75ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.**

మద్దూరు(హుస్నాబాద్): జలియన్‌వాలాబాగ్ సంఘటనని తలపించిన వీరాభైరాన్‌పల్లి నెత్తుటి చరిత్రకు ఈనెల 27వ తేదీతో 75 ఏళ్లు నిండాయి. రజాకార్ల పాశవిక దాడులను ఎదిరించి పోరాడిన భైరాన్‌పల్లి వీరుల ప్రాణత్యాగం మరువలేనిది. మాతృ భూమి విముక్తి కోసం 118 మంది యోధులు నేలకొరిగారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ప్రజలు స్వేచ్ఛా వాయువులను పీలుస్తుండగా, నిజాం రాజు గుప్పిట్లో ఉన్న తెలంగాణ ప్రాంతం మాత్రం రజాకార్ల దురాగతాలకు బలవుతూ బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీసింది.

1948 ఆగస్టు 27వ తేది వేకువజామున 4 గంటల ప్రాంతం. నిజాం సైన్యాధిపతి ఖాసీం రజ్వీ సైనికులు(రజాకార్లు) భైరాన్‌పల్లి గ్రామంలో తమకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకునేందుకు 1,200 మంది సైన్యంతో అర్ధరాత్రి 12 గంటలకు పది ట్రక్‌లతో జనగామ నుంచి బయలుదేరారు. రాత్రి 2 గంటలకు లద్నూరు గ్రామానికి చేరుకొని 3 గంటలకు భైరాన్‌పల్లి గ్రామాన్ని చుట్టుముట్టారు. తెల్లవారుజామున 4 గంటలకు ఉల్లెంగం(వడ్ల) నర్సయ్య గ్రామ చివరకు బహిర్భూమికి వెళ్లడంతో మాటువేసిన రజాకార్లు పట్టుకున్నారు. గ్రామంలోని బురుజు వద్దకు దారి చూపాలని వెంట పెట్టుకొని నడుస్తుండగా వారిని నెట్టేసి రజాకార్లు గ్రామాన్ని చుట్టుముట్టారంటూ పెద్దగా కేకలు వేస్తూ పరుగులు పెట్టాడు. దళ కమాండర్ ఇమ్మడి రాజారెడ్డి ప్రజలంతా తగిన రక్షణలో ఉండాలని కోరుతూ నగారా మోగించారు. గ్రామస్తులంతా బురుజు వద్ద గడీలోకి పరుగులు తీశారు. యువకులు గ్రామానికి నాలుగు వైపులా కాపు కాసి శత్రువులను గ్రామంలోకి రాకుండా చూడాలని హెచ్చరికలు జారీ చేశారు. గ్రామాన్ని చుట్టుముట్టిన రజాకార్లను తరిమి వేయడానికి బురుజు పై నుంచి కాల్పులు ప్రారంభించారు. గ్రామస్తులు ఏ వైపు నుంచి కాల్పులు జరుపుతున్నారో చూసి రజాకార్లు కూడా కాల్పులు ప్రారంభించారు. కాల్పులు కొనసాగుతున్న సమయంలో బురుజు పైనున్న మందుగుండు సామగ్రిలో నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. అవి పేలి బురుజుపై ఉన్నవారు నేలకొరిగారు. బురుజు పై నుంచి కాల్పులు ఆగిపోవడంతో రజాకార్లు గ్రామంలోకి చొరబడి దొరికిన వారిని దొరికినట్లు చంపారు. ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ..బురుజుపైనున్న కొందరిని కిందకు దింపి వరుసగా నిల్చోబెట్టి దారుణంగా కాల్చి చంపి రక్త దాహాన్ని తీర్చుకున్నారు. గ్రామం మొత్తాన్ని వల్లకాడుగా మార్చారు.బుజురు నుంచి భయంతో పరుగులు పెడుతున్న మహిళలను వెంటాడి పట్టుకున్నారు. అనేక మంది మహిళలపై అత్యాచారానికి పాల్పడిన సంఘటనలు రజాకారుల రాక్షసత్వానికి నిదర్శనం.

**శవాల చుట్టూ బతుకమ్మ ఆట**

భైరాన్‌పల్లిలో ఆగస్టు 27న రజాకార్ల దాడిలో చనిపోయిన శవాలను గుట్టలుగా పడేశారు. మహిళలను వివస్త్రలను చేసి వాటి చుట్టూ బతుక మ్మ ఆడించి పైశాచిక ఆనందాన్ని పొందారు. ఆనాటి సంఘటనను గుర్తుచేసుకుంటూ భైరాన్‌పల్లి గ్రామస్తులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఈ దుర్ఘటనలో 118 మంది గ్రామస్తులు వీరమరణం పొందారు.

### ప్రాణాలను అడ్డుపెట్టి..



దొంగ దెబ్బ తీసేందుకు రజాకార్లు గ్రామంలోకి ప్రవేశించడానికి ప్రయత్నం చేశారు. ప్రాణాలను అడ్డుపెట్టి వారి కీచక చర్యలను ఎదుర్కొన్నాం. నేటికీ ఆనాటి రజాకార్ల దుశ్చర్యలు కళ్ల ఎదుట కదలాడుతున్నాయి.

– వెంకట్‌రెడ్డి, సమరయోధుడు, భైరాన్‌పల్లి

### సమరయోధుల కుటుంబాలను ఆదుకోవాలి



నిజాం సైన్యాధిపతి ఖాసీం రజ్వీ పైశాచిక దాడులను ఎదుర్కొని చరిత్ర సృష్టించిన భైరాన్‌పల్లిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. జలియన్ వాలాబాగ్ ఘటనను పోలిన ఉదంతానికి ఎదురొడ్డి ఎందరో ప్రాణాలు కోల్పోయిన, పోరాటంలో పాల్గొన్న వారి కుటుంబాలను ఆదుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భైరాన్‌పల్లి చరిత్రను మరిచాయి. ఇప్పటికైనా భైరాన్‌పల్లి చరిత్రను గుర్తించాలి.

– బండి శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ (భైరాన్‌పల్లి)

### పోరాటానికి గుర్తింపు కరువు

జలియన్‌వాలాబాగ్ ఘటనను మించిన భైరాన్‌పల్లి పోరాటాన్ని ప్రభుత్వాలు పాఠ్యాంశాల్లో చేర్చకపోవడం శోచనీయమని సర్పంచ్ బండి శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల కుటుంబాలను ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు ఆదుకోలేదని పలువురు చెబుతున్నారు. నేటికీ ఆ కుటుంబాలు దయనీయ స్థితిలో కాలం వెల్లదీస్తున్నాయని, స్వరాష్ట్రం కోసం సాగిన తొలి, మలి దశ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన వీర భైరాన్‌పల్లి పోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరుతున్నారు.


భైరాన్‌పల్లి చరిత్రకు నిదర్శనమైన బురుజు

## ఆచరణకు సాధ్యం కాని హామీలిస్తూ మోసం

మహారాష్ట్రలోని వార్ధా ఎమ్మెల్యే పంకజ్ రాజేష్ బోయర్


మాట్లాడుతున్న పంకజ్ రాజేష్ బోయర్

కొండపాక(గజ్వేల్): అధికారంలోకి వచ్చేది బీజేపీయే అని, అందుకనుగుణంగా కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని మహారాష్ట్రలోని వార్ధా ఎమ్మెల్యే పంకజ్ రాజేష్ బోయర్ పేర్కొన్నారు. కొండపాక మండలం దుద్దెడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు మన్నెం శిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంకజ్ రాజేష్ మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ ఆచరణకు సాధ్యం కాని హామీలిస్తూ ప్రజలను మోసగిస్తున్న తీరును ప్రజలకు వివరించాలన్నారు. లక్షల కోట్లతో ప్రవేశ పెడుతున్న పథకాలు బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇస్తూ సంక్షేమ లక్ష్యం నీరుగార్చుతున్నారన్నారు. పేదల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తామే ప్రవేశ పెడుతున్నామని కేసీఆర్ సర్కార్ చెప్పుకోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో సాగుతున్న కుటుంబ పాలనకు స్వస్తి పలికేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీతో బీజేపీకి ఎలాంటి పొత్తులు ఉండవని, కాంగ్రెస్ కావాలనే దుష్ప్రచారం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి పూదూరి నందన్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు ఎల్లు రాంరెడ్డి, దారం గురువారెడ్డి, సీనియర్ నాయకులు కప్పర ప్రసాద్, నలగామ శ్రీనివాస్, రాములు, మహేష్, అనూష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో కూలీ మృత్యువాత

- అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు
- నష్ట పరిహారం కోసం ఆందోళన


కరెంట్ షాక్ తో మృతిచెందిన నర్సింలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి చెందిన సంఘటన చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు వివరాలు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామానికి చెందిన వెలిమెల శ్రీకాంత్ శివంపేట గ్రామ శివారులో వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమిని గ్రామానికి చెందిన మిరియాల వెంకటేశం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పశువుల సంరక్షణ కోసం వెంకటేశం పుల్కల్ మండలం ఇసోజిపేట గ్రామానికి చెందిన మంగలి నర్సింలు (55)ను జీతానికి కుదుర్చుకున్నాడు. ఏడాదిన్నరగా ఉంటున్న నర్సింలు ఎప్పటిలాగే పచ్చిగడ్డి కోసం పొలానికి వెళ్లాడు. గడ్డి కోస్తుండగా కరెంట్ షాక్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు.

నర్సింలు మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాళ్లకు గమ్ షూ ధరించి ఉండగా విద్యుత్ షాక్ ఎలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు. అలాగే చేతిలోని కొడవలి నోట్లోకి ఎలా వెళ్లిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి వచ్చిన ఎస్‌ఐ విజయ్‌కుమార్ గౌడ్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలిస్తుండగా బంధువులు అడ్డుకున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని మొండికేశారు. దీంతో భూమి యజమాని శ్రీకాంత్ కుటుంబసభ్యులతో పాటు కౌలుదారు వెంకటేశంతో ఎక్స్‌గ్రేషియా విషయమై చర్చలు జరిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## ఇంటిలో గంజాయి మొక్కలు స్వాధీనం

పోలీసుల అదుపులో నిందితుడు


గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ ఇంటి ఆవరణంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల వివరాలు. గ్రామానికి చెందిన యాళ్ల రమేష్ ఇంటి ఆవరణంలో నాలుగు గంజాయి మొక్కలు ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి తహసీల్దార్ ఇంజమూరి సంజీవ్‌కుమార్ సమక్షంలో పంచనామా నిర్వహించి, నాలుగు మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాండ్ర వివేక్ తెలిపారు. అయితే నిందితుడు మాత్రం తన ఇంటి ముందు గంజాయి మొక్కలు పెరుగుతున్నట్లు తనకు తెలియదని, అవి ఎన్నడూ చూడలేదని చెబుతున్నాడు. మొక్కలను ఎవరైనా నాటారా..? లేదా సహజ సిద్ధంగా పెరిగాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎర్రల కిరణ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

**నిందితుడు 'గౌరవెల్లి' భూ నిర్వాసితుడు**

గుడాటిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తెనుగుపల్లెకు చెందిన రమేష్ ఇల్లు, భూమి గౌరవెల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురైంది. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో పరిహారం తీసుకున్న తర్వాత అంతక్కపేట గ్రామంలో ఏడాది కిందట ఓ ఇల్లు, గ్రామశివారులో సుమారు 8 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇల్లు కొనుగోలు చేసుకున్నప్పటి నుంచి ఆవరణంలో రకరకాల మొక్కలు పెరుగుతున్నాయని, గంజాయి మొక్కలు ఎలా ఉంటాయో తమకు తెలియదని రమేష్ కుటుంబ సభ్యులు వాదిస్తున్నారు. అలాగే ఇరుగుపొరుగు వాళ్లు కూడా ఇదే విషయాన్ని తెలుపుతున్నారు.

**కాల్మొక్త సార్.. వదిలిపెట్టండి**

మాకు అవి గంజాయి మొక్కలని తెలియదు.. కాల్మొక్త సార్.. వదిలిపెట్టండి అంటూ నిందితుడి కుటుంబసభ్యులు తహసీల్దార్‌ను వేడుకున్నారు. మీకు తెలియకుండానే నాలుగు గంజాయి మొక్కలు సుమారు నాలుగైదు మీటర్ల ఎత్తులో ఎలా పెరిగాయా..? అని నిలదీశారు.

### గత చరిత్రపై ఆరా..

గంజాయి అలవాటు, కేసులు తదితర కోణాలపై నిందితుడి గత చరిత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే ఇటీవల గౌరవెల్లి, ముంపు గుడాటిపల్లి గ్రామాల పరిధిలో గంజాయి మత్తులో ఇద్దరు యువకులు బ్లేడ్లతో మెడ కోసుకున్న సంఘటన చోటుచేసుకున్న విషయం విధితమే. ఈ క్రమంలో నిందితుడు కూడా ముంపు ప్రాంతం నుంచే రావడంతో పోలీసులు పలు కోణాలలో ఆరా తీస్తున్నారు.

## అనుమానితులు వీరే..!




జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లిగ్రామ శివారులోని మేడలమ్మ తల్లి దేవాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు సీసీ కెమెరాల ద్వారా విచారణ జరిపారు. ఇద్దరు అనుమానిత వ్యక్తుల ఫొటోలను శనివారం విడుదల చేశారు. వీరిని గుర్తుపడితే 8712656751 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ లక్ష్మారెడ్డి కోరారు. చోరీలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## యువకుడికి గాయాలు

తొగుట(దుబ్బాక): విద్యుత్ అధికారి నిర్లక్ష్యంతో యువకుడు కరెంట్ షాక్‌కు గురైన సంఘటన శనివారం సాయంత్రం మండలంలోని లింగాపూర్ శివారులో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాలు. గ్రామ శివారులోని ఓ కోళ్ల ఫారం యజమాని కరెంట్ బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్‌శాఖ అధికారి ఉదయం కరెంట్ తొలగించాడు. సాయంత్రం కరెంట్‌ను పునరుద్ధరించాలని కోరగా సదరు అధికారి తుక్కాపూర్‌కు చెందిన బోయిని కిషన్ (26)ను తీసుకెళ్లి 11కేవీ విద్యుత్ స్తంభం ఎక్కించాడు. సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకోకపోవడంతో యువకుడు విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. నడుము విరిగి తీవ్రంగా గాయపడటంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.

## మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

వర్గల్(గజ్వేల్): కాలకృత్యాలకు వెళ్లిన మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని దుండగుడు బంగారు పుస్తెల తాడును తెంపుకుని ఉడాయించాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున వర్గల్ మండలం వేలూరులో జరిగింది. గౌరారం ఎస్సై విజయభాస్కర్ వివరాలు. వేలూరుకు చెందిన నల్లనాగుల అనురాధ శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో కాలకృత్యాల కోసం నిద్రలేచింది. ఆ సమయంలో గుర్తుతెలియని దుండగుడు ఆమె మెడలో నుంచి నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకుని ఉడాయించాడు. ఆమె తేరుకుని గట్టిగా అరవడంతో కుటుంబసభ్యులు నిద్రలేచారు. వారు బయటకు వచ్చి చూసేలోగా అప్పటికే దొంగ పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి చైన్‌స్నాచింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

**గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి**


మృతుడు శంకర్

చేగుంట(తూప్రాన్) గుర్తు తెలియని వాహనం ఢీకొని టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన చేగుంట శివారులోని రెడ్డిపల్లి బైపాస్ వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాలు. కామారెడ్డి జిల్లా రాజంపేట గ్రామానికి చెందిన కాసం శంకర్(63) టీవీఎస్‌పై హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో చేగుంట శివారులోని రెడ్డిపల్లి బైపాస్ వద్ద వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ హరీష్ తెలిపారు.

**ఆటో, బైక్ ఢీకొని యువకుడు..**


శ్రీకాంత్ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): ఆటో, బైక్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం కౌడిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి వివరాలు. కొల్చారం మండలం నాయిని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన బోండ్ల శ్రీకాంత్(25) శుక్రవారం రాత్రి బైక్ మీద కౌడిపల్లి వస్తుండగా వెల్మకన్న వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో ఎదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుని తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

**హైడ్రాలిక్ మీద పడి డ్రైవర్..**


దేవయ్య(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): ట్రాక్టర్ హైడ్రాలిక్ మీద పడడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి నిజాంపేట మండలం బాచేపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన అంకుంపేట దేవయ్య(28) ట్రాక్టర్ ద్వారా మట్టి వేసే పనులు చేస్తున్నారు. ట్రాక్టర్ హైడ్రాలిక్ చెడిపోవడంతో మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తలపై పడింది. తీవ్ర గాయం కావడంతో స్థానికులు నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమమంగా ఉండడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో దేవయ్య చనిపోయాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## కాలంతో పనిలేకుండా చెరువుల్లోకి నీరు

ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు


మంత్రికి గొర్రెపిల్లను బహూకరిస్తున్న కురుమ సంఘం సభ్యులు

సిద్దిపేటరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనం, రెడ్డి కులసంఘ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, డంప్‌యార్డు, వైకుంఠధామం ప్రారంభోత్సవాలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. కొద్దిసేపు గుర్రం బండెక్కి ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కారణంగా చిన్న గ్రామమైన రాంపూర్ లో యాసంగి పంట 18 లారీల ధాన్యం పండించారని పేర్కొన్నారు. కాలంతో సంబంధం లేకుండా కాలువల ద్వారా చెరువుల్లోకి సీఎం కేసీఆర్ నీటిని తీసుకువచ్చారన్నారు. కడుపులో బిడ్డ నుంచి అందరికీ ప్రభుత్వమే సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. గ్రామంలో సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు 42 మందికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. అంజన్న గుడి నిర్మాణానికి సాయం అందిస్తానన్నారు. గ్రామ డబుల్ రోడ్ కోసం రూ.5 కోట్లు మంజూరు చేశామన్నారు. గ్రామంలోని ఓట్లన్నీ ఈసారి బీఆర్‌ఎస్‌కే వేయాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్, యాదయ్య, భిక్షపతి, పాల్గొన్నారు.

**పోలీస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలోనే మోడల్ పోలీస్ స్టేషన్‌గా సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించనున్నట్లు మంత్రి హరీశ్‌రావు అన్నారు. పట్టణంలోని రంగధాంపల్లి శివారులో త్రీ టౌన్ నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. రెండు అంతస్తుల్లో రూ.4.44కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు, వంగ నాగిరెడ్డి, రాజనర్సు, పాల్గొన్నారు.

**దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు**

సిద్దిపేటజోన్: భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక టీటీసీ భవన్‌లో 233 మంది దివ్యాంగులకు రూ.17లక్షల విలువైన ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేటలో భవిత సెంటర్ సైకోవేటర్ పార్క్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ కు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రొసీడింగ్ కాపీల అందజేత**

సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పరిధిలోని చిన్నకోడూర్, సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని కుల సంఘ భవనాలకు రూ.97 లక్షల మేర ప్రొసీడింగ్ కాపీలు మంత్రి అందించారు. అదేవిధంగా హాస్టల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో మంత్రి పాల్గొని నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్ పనితీరు, పురోగతిపై సమీక్షించారు. జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కవిత, బీసీ వెల్ఫేర్, ఎస్టీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

## బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులు


సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

దుబ్బాక: హీరో సుమన్ చేతుల మీదుగా దుబ్బాక విద్యార్థులు కరాటే బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు అందుకున్నారని ఆర్ట్ ఆఫ్ డిఫెన్స్ అకాడమీ ఇండియా ఫౌండర్ అండ్ స్టైల్ చీఫ్ మాస్టర్ బురానీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని మణికొండలోని కేఎం గుప్తా హోటల్లో సర్టిఫికెట్లు అందజేశారని చెప్పారు. వీటిని అందుకున్న వారిలో లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులు హర్షవర్ధన్, శ్రీకర్‌గౌడ్, గౌతమి, దుబ్బాక గాయత్రి వివేకానంద విద్యాలయం ఆకాష్, నవనీత్, సిద్దిపేట శ్రీచైతన్య స్కూల్ మనస్విని, అక్షయ, లాస్య, దీప్తి, అంబిటస్ విద్యార్థులు వర్షిణిరెడ్డి, యశ్వంత్‌రెడ్డి ఉన్నారని తెలిపారు.